# మహాశిల్పి

రచన;
శ్రీ నూతి శ్యామసుందర్.

ఆ రోజు ఊరిలోని జనమంతా దేవాలయం వద్దవున్నారు. ఆరోజు దేవాలయంలో విగ్రహ స్థాపన జరుగుతోంది. గ్రామ పెద్దలందరు ఆలయ ప్రాంగణంలో ఆసీనులై వున్నారు. ప్రజలందరు హడావిడిగా అటునిటు తిరుగుతున్నారు. ఆలయమంతా మామిడితోరణాలతో కట్టబడి వుంది, చుట్టు పందిళ్ళు వేసారు. జనమంతా తివాచీలపై కూర్చున్నారు. ఒక వైపు మంగళ వాద్యాలు మిన్నంటి మ్రోగుతున్నాయి. పూజారులందరు, పట్టుధోవతులు కట్టి మెడలో రుద్రాక్షమాలలతో, నుదుట విభూతి రేఖలతో చెరగని చిరునవ్వులతో మంత్రోచ్ఛారణ గావిస్తున్నారు. అందరు విగ్రహాన్ని ఎప్పుడు దర్శించుదామా అన్నట్టు కుతూహలంతో గర్భగుడివైపు చూస్తు కూర్చున్నారు. ముహూర్తం సమీపించింది. పూజారుల మంత్రాలు, మంగళతూర్యాలు ఏకమై వినిపిస్తున్నాయి. అంతలో విగ్రహాని కడ్డంగావున్న తెరతొలిగింది. ఒక్కసారిగా అందరు హా! శివశంకర, పార్వతీవల్లభా! అంటు స్తుతించుచు సాగిలపడి మొక్కుతున్నారు. శివపార్వతుల విగ్రహాన్ని చూచి తన్మయులైపోతున్నారు. మెడలో పన్నగహారము, తలపై చంద్రవంక, శిగలో గంగాదేవిని బంధించి, ప్రక్కన పార్వతీదేవిని ధరించి, చర్మాంబరధారియైవున్న ఆ దేవుని గాంచి, ప్రజలు పులకితులవుతున్నారు. ఎన్నిమార్లు చూసనా మరీ మరీ చూడాలనిపించె ఆ మూర్తి, గాంచి తమ బ్రతుకు ధన్యమైనట్లుగా భావించుకొనుచున్నారు.

అందరికంటే దూరంగా విగ్రహాన్ని చూడ నోచుకోని అభాగ్యుడు నిలుచున్నాడు. తన చేతితో మలిచిన విగ్రహాన్ని, రంగులుపూసి రమణీయంగా తీరిచి దిద్దిన తనను చూడనివ్వటంలేదు. ఎందుకు? తను అంటరానివాడు. విగ్రహాన్ని మలిచేటప్పుడు లేని అంటరానితనం ఇప్పుడు అడ్డొచ్చింది. ఎన్నిరోజులు కష్టించి, పగలు రాత్రనక శ్రమించి, అతిరమణీయంగా, అందరు అబ్బురపడేవిధంగా యలిచాను. కాని ఏమి లాభం. చివరికి నన్నె చూడనివ్వటంలేదు. తను మలిచిన విగ్రహాన్ని చూడటానికి తనే అర్థిస్తున్నాడు. ప్రజలను, గ్రామ పెద్దలను, పూజారులను, అయ్యా! ఒక్కసారి నా విగ్రహాన్ని నా చేతితో మలిచిన నా శివపార్వతుల విగ్రహాన్ని ఒక్కసారి చూడనివ్వండి బాబు! మీకు దణ్ణంపెడతాను. బైటికి నడువు, లోపలికి వస్తే దేవుడు మైలపడిపోతాడు అంటూ కసిరారు. నడు, నడు, అంటరానివాడివి నీవు అంటు బయటికి గెంటివేసారు. పడిపోయాడు. ఆవేశం కట్టలు త్రెంచుకువస్తుంది. కాని ఏమి లాభం. పేదవాడి కోపం పెదవికిచేటు అన్నట్లు వూరుకున్నాడు. న్యాయం, ధర్మం ఏనాడో మంటగలిసి పోయాయి. మూఢాచారాలు, బూజపట్టిన భావాలతో, కులం తక్కువవాడని నిలేస్తున్నారు అంటు చివరిసారిగా ఆలయానికేసి చూసి నమస్కరించి, ఏది ఏమైనా విగ్రహం, తన చేతులమీదుగా తయారు చేశానన్న తృప్తితో సాగిపోయాడు "మహాశిల్పి" శివయ్య.